క్లుప్తంగా

ఐకేపీ పథకాలపై సమావేశం



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లిలో బుధవారం ఐకేపీ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర సెక్రటేరియట్ సర్వీసెస్‌లో అసిస్టెంట్ సెక్షన్ అధికారులుగా(ఏఎస్‌వో) ప్రొబేషనరీ అధికారులు గ్రామంలో ఐకేపీ పథకాల పనితీరును పరిశీలించారు. గ్రామ పరిధిలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి. ఎన్ని సంఘాలకు రుణాలు ఎంత మంజూరయ్యాయి అనే అంశాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాల ద్వారా గ్రామీణులు ఏ విధంగా లబ్ధి చెందుతూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారనే అంశాలపై అధ్యయనం చేశారు. దీంతో పాటు వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో బృందం సభ్యులు రిషవ్ దేవ్‌కుమార్ ప్రసాద్, వెంకటేష్ బాబు, హర్మీత్ కుమార్, సన్నీ కుమార్, హన్సరాజ్ జాఖర్, ఐకేపీ ఏపీఎం శ్యామల, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, వైద్య సిబ్బంది, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇళ్ల స్థలాలపై నిలదీయండి'

పాతమంచిర్యాల: ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే పాలక పార్టీలకు చెందిన నాయకులను ఇళ్ల స్థలాల పంపిణీపై నిలదీయాలని సీపీఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో బుధవారం కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను ఇళ్లు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రమాదేవి, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రచార కార్యదర్శి సురేష్, నాయకులు లక్ష్మణ్, ఆదిలక్ష్మి, అనాల రాజక్క పాల్గొన్నారు.

రాజకొమురయ్యకు అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజకొమురయ్య

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు మడిపల్లి రాజకొమురయ్యకు బెస్ట్ యోగా మాస్టర్ అవార్డు లభించింది. యోగాలో రాణిస్తున్న రాజకొమురయ్యకు ఢిల్లీలో ఈ నెల 15న బహుజన సాహిత్య అకాడమీ వారు నిర్వహించిన కార్యక్రమంలో రాజకొమురయ్యకు అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అవార్డును అందజేశారు.

20న మందకృష్ణ రాక

పాతమంచిర్యాల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఈ నెల 20న జిల్లా కేంద్రానికి రానున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభ విజయవంతానికి ఈ నెల 20న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రథయాత్ర ప్రారంభించి అక్కడి నుంచి మంచిర్యాలకు చేరుకుంటారన్నారు.

బీజేపీ గెలిస్తేనే సంక్షేమం



ప్రచారంలో పాల్గొన్న వెరబెల్లి స్రవంతి

మంచిర్యాలటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి సతీమణి వెరబెల్లి స్రవంతి అన్నారు. జిల్లా కేంద్రంలోని 5వ వార్డు శ్రీశ్రీనగర్ కాలనీలో బుధవారం ఇంటింటికి వెళ్లి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆ పథకాలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు అందాలంటే రాష్ట్రంలోనూ బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బోయిని హరికృష్ణ, జోగుల శ్రీదేవి, పల్లి రాకేశ్, ప్రభ, స్వప్న, అశోక్, కమెర అర్జున్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను వీడడం లేదు'

మంచిర్యాలటౌన్: తాను కాంగ్రెస్ పార్టీని వీడి, బీఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నట్లుగా కొందరు స్వార్థపరులు సోషల్ మీడియాలో చేస్తున్న ఆరోపణలను తాను ఖండిస్తున్నానని, కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేవీ ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. తనకు మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్‌ను ఇవ్వకపోయినా, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం తాను కృషి చేస్తానని స్పష్టం చేశారు.

కార్మిక వాడలకు నీళ్లు బంద్

- వారం రోజులుగా నిలిచిన సరఫరా
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రామాలయం ఫిల్టర్ బెడ్

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని కార్మిక కాలనీలకు వారం రోజుల నుంచి నీటి సరఫరా నిలిచింది. కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బంది పడుతున్నాయి. తాగునీరు బంద్ కావడంతో అనివార్యంగా కార్మికులు ప్యూరిఫైడ్ వాటర్ కొనుగోలు చేసి అవసరాలు తీర్చుకుంటున్నారు. కార్మిక కుటుంబాలకు రామాలయం ఫిల్టర్ బెడ్‌లో నీటిని శుద్ధి చేసి ఒక్కో ఏరియా వారీగా సరఫరా చేస్తున్నారు. ఫిల్టర్‌బెడ్ హౌజ్‌లో ఇసుక మార్పిడి చేయకపోవడంతో కొద్ది రోజుల నుంచి తెట్టలు కట్టాయి. కారణంగా నీరు శుద్ధి కాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మందమర్రి ఫిల్టర్ బెడ్ నుంచి వారం రోజులుగా బెల్లంపల్లికి గోదారి నీళ్లు ఆగిపోయాయి. అవసరాలకు మాత్రమే గోదారి నీళ్లు వాడుకుని, బెల్లంపల్లిని విస్మరిస్తుండటంతో తాగునీటికి కటకట ఏర్పడిందని కార్మికులు పేర్కొంటున్నారు. శాంతిఖని గని నుంచి వచ్చే నీళ్లు ఫిల్టర్ కాకుండా వృథాగా పోతున్నాయి. ఆ తీరుగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడటంతో తాగునీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడి ఇబ్బంది పడాల్సిన దుస్థితి వచ్చింది. బెల్లంపల్లిలో గనులు మూతపడి, విభాగాలు ఎత్తివేతకు గురి కావడంతో అత్యల్ప మంది ఉన్న కార్మికుల సంక్షేమాన్నీ, అవసరాలను సింగరేణి అధికారులు సరిగ్గా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నీటి అవసరాల కోసం కార్మిక కుటుంబాలు అడప్రాజెక్టు నుంచి వచ్చే మిషన్ భగీరథ ట్యాప్ వద్దకు క్యాన్‌లు పట్టుకుని పరుగెత్తుతున్నారు. బెల్లంపల్లి సివిల్ విభాగంలో సరిపడా మ్యాన్ పవర్ లేకపోవడం, బాధ్యతాయుతమైన అధికారులు కరువై నీటి సమస్య ఉత్పన్నమవుతోందని కార్మిక సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకుని నీటి సరఫరాను పున:రుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి

కార్మిక వాడలకు నీటి సరఫరా నిలిచినా, అధికారులు చర్యలు తీసుకోకపోవడం సరైంది కాదు. అత్యవసరంగా స్పందించాల్సిన అవసరం ఉన్నా, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడాన్ని వ్యతిరేకిస్తున్నాం. గుర్తింపు, ప్రాతి నిధ్య సంఘాలుగా వ్యవహరించిన ప్రధాన కార్మిక సంఘాల నాయకులు మి న్నకుండి పోవడం విస్మయం కలిగిస్తోంది.



– ఓదెలు, ఐఎన్‌టీయూసీ నాయకుడు

మస్తు గోసైతంది..



నీళ్లు రాక మస్తు గోసైతంది. వారం దినాలు గడిచినా నీటి సరఫరాను మెరుగుపర్చడం లేదు. నీళ్ల కోసం మిషన్‌భగీరథ ట్యాప్ వద్దకు, బోర్‌వెల్ కాడికెళ్లి క్యాన్లు నింపుకుని వస్తున్నం. మా గోస ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

– స్రవంతి, స్థానికురాలు

నీళ్లు రావడం లేదు



వారం రోజుల సంది నీళ్లు రావడం లేదు. బట్టలు ఉతకడానికి, స్నానం చేయడానికి, తాగడానికి నీళ్లు సరిప డా లేక ఇబ్బంది పడుతున్నం.

– పులబోయిన ఐలమ్మ, బెల్లంపల్లి

నేటి నుంచి అకాలీబోధన్

- బెంగాలీల ఆధ్వర్యంలో దుర్గామాతకు పూజలు
- ఈ నెల 19నుంచి ఉత్సవాలు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: బెంగాలీ కాందిశీకులు తమ ఆరాధ్యదైవం కాళీమాతాకు మరో రూపమైన దుర్గాదేవిని ప్రత్యేకంగా కొలుస్తారు. అకాలి బోధన్ అని వారు పిలిచే ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బెంగాలీ కుటుంబాలు ప్రత్యేకంగా నిర్వహించుకునే దుర్గామాతా ఉత్సవాల కోసం స్థానిక విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపం ముస్తాబైంది. సర్వజనని దుర్గాదేవి నిర్వాహక మండలి ఆధ్వర్యంలో ఈ నెల 19న సాయంత్రం దుర్గాదేవి పంచమి పూజతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. ప్రధాన దేవతామూర్తయిన దుర్గాదేవిని శక్తి స్వరూపిణిని అయిన త్రినేత్రిగా భావిస్తారు. పార్వతికి ప్రతిరూపమైన దుర్గాదేవితో పాటు పలు దేవతల విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తారు. దుర్గాదేవి దశావతారమైన అదృశ్య రూపానికి గుర్తుగా అరటి చెట్టు కాండం ఆకులకు చీరకట్టి అలంకరించి పూజ చేస్తారు. సంస్కృతి, సంప్రదాయాలను మరవకుండా ఈ పండుగను వైభవంగా నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. దుర్గాదేవికి అక్కాచెల్లెళ్లు అయినా లక్ష్మీదేవి, సరస్వతి, కుమారులైన గణపతి, కార్తికేయుల విగ్రహాలను ఏర్పాటు చేసి ఐదు రోజుల పాటు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

ఐదు రోజులు ఇలా..

మొదటి రోజు(20న): షష్టినాడు దుర్గాషష్టి పూజ నిర్వహిస్తారు. వేదపండితుల ఆధ్వర్యంలో ముందుగా అసురుడైన మహిషాసురుడికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం కలశపూజ, విగ్రహాల ప్రతిష్టాపన, కలశాలు ఏర్పాటు చేస్తారు.

రెండో రోజులు (21న): సప్తమి నాడు ఉదయం సాయంత్రం పూజ, హారతి కార్యక్రమం

మూడో రోజు(22న): దుర్గాదేవి మహా అష్టమి పూజ, పుష్పాంజలి కార్యక్రమంలో భాగంగా దేవతా మూర్తులకు పూలు, పత్రి అక్షింతలతో అభిషేకం చేస్తారు.

నాల్గో రోజు(23న): నవమి పూజ నిర్వహించనున్నారు. దుర్గామహర్నవమి నాడు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. బెంగాలీల సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలతో భక్తులు రాత్రి సమయంలో జాగరణ చేస్తారు.

ఐదో రోజు(24న): దుర్గాదేవి దశమి పూజ జరుపనున్నారు. జిమ్మి పూజల అనంతరం సంధ్యహారతి ఇవ్వనున్నారు. 25న సింధూర ఉత్సవ్, పూజలు అనంతరం దేవతా విగ్రహాల శోభయాత్రతో నిర్వహించి గోదావరిలో నిమజ్జనం నిర్వహిస్తారు.



వేడుకలకు అందరూ వస్తారు

ఏటా దుర్గాదేవి వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటాం. అమ్మవారికి హారతి, పుష్పాంజలి, మహాప్రసాద కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తాం. దు పాస్టర్ ఆఫ్ ప్యారీస్‌కు బదులుగా మట్టి ప్రతిమలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈ వేడుకలను సంతోషంగా జరుపుకుంటాం.

– రీణారాణిదాస్, కార్యక్రమ నిర్వహకురాలు

'వచ్చే ఎన్నికల్లో ప్రేమ్‌సాగర్‌రావును గెలిపించాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు ఒకసారి అవకాశం కల్పించి ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రేమ్‌సాగర్‌రావును ప్రజలు ఓడించినా, నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు గెలిపిస్తే, నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

దండేపల్లిలో ప్రచారం

దండేపల్లి: ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరుగ్యారంటీలపై దండేపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు, రాజన్న, లింగన్న, సత్తయ్య, శంకరయ్య, గోపాల్, మురళీ, సత్యం, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలం ముల్కల్లలో గడపగడపకూ పీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీలపై ప్రజలకు వివరించారు. మండల పార్టీ అధ్యక్షుడు రవి, ఎంపీటీసీ బాపు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

భీమారం/నస్పూర్/చెన్నూర్‌రూరల్/కాసిపేట/నెన్నెల/రామకృష్ణాపూర్/జన్నారం: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సహకరించాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్‌లో లేదా వివిధ మొబైల్ యాప్‌ల విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని పేర్కొంటున్నారు. ఊరూరా ప్రజలకు విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యుత్ అక్రమంగా వాడుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నారు. చెన్నూర్‌రూరల్ మండలంలోని ఆస్నాదలో కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ భాస్కర్, ఉప సర్పంచ్ నస్కూరి శ్రీనివాస్, లైన్‌మెన్ సదానందం, జూనియర్ లైన్‌మెన్లు వేణు, సురేష్ పాల్గొనగా, భీమారంలో విద్యుత్తుశాఖ చెన్నూరు ఏడీఏ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఈ కుమారస్వామి, ఏఓ రత్నాకర్ పాల్గొన్నారు. కాసిపేటలో విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత ఇంటింటికీ తిరుగుతూ విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు. నెన్నెలలో బెల్లంపల్లిరూరల్ విద్యుత్ ఏడీ రాంచందర్, మండల ఏఈ మల్లయ్య కలిసి వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేఏఓ వరప్రసాద్, నెన్నెల సబ్ ఇంజినీర్ సుదీప్త పాల్గొన్నారు. నస్పూర్‌లో విద్యుత్ ఏఈ రామ్మూర్తి వినియోగదారులకు అవగాహన కల్పించారు. రామకృష్ణాపూర్‌లో విద్యుత్ శాఖ ఏఈలు శ్రీలత, జయకృష్ణ, నాగేశ్వర్‌రావు, సబ్ ఇంజినీర్ రమ్యకృష్ణ, జేఏఓ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. జన్నారం మండలం పొన్కల్‌లో ఏవో యాదగిరి, ఏఈఈ లచ్చన్న, సబ్ ఇంజనీర్ అజయ్, ఎల్ఐ లచ్చన్న, లైన్‌మెన్ శ్రీనివాస్, ఆర్‌సీ పవన్‌కుమార్ అవగాహన కల్పించారు.



నెన్నెల: యాప్ ద్వారా అవగాహన



భీమారంలో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

లాభాల వాటా కోసం సమ్మెకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిరూరల్: ఈ నెల 21లోగా సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటా చెల్లించకుంటే కార్మికవర్గం ఒక్కరోజు ×టోకెన్ సమ్మె×కు సిద్ధం కావాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, హెచ్ఎమ్మెస్ ఏరియా ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి పిలుపునిచ్చారు. వేర్వేరుగా బుధవారం నిర్వహించిన సమావేశాల్లో నాయకులు మాట్లాడారు. ఎన్నికల కోడ్ పేరిట వాటా పంపిణీలో యాజమాన్యం తీరు బాగా లేదని మండిపడ్డారు. ఈ నెల 21న చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందని ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మికులు 21న సమ్మెకు సిద్ధం కావాలి

కాసిపేట: యాజమాన్యం సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన లాభాల బోనస్ ఎన్నికల కోడ్ పేరుతో నిలిపివేయడాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట నిరసన, 21న చేపట్టిన ×టోకెన్ సమ్మె×కు కార్మికులు సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై బుధవారం సమ్మెపై ప్రచారం నిర్వహించారు. కార్మికులు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మినారాయణ, నాయకులు ఇరుగురాల సంపత్, చౌడ లింగయ్య, ఆడెపు రవీందర్, స్వామి, మేకల అంజనేయులు తదితరులున్నారు.

జైపూర్: సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన 32శాతం లాభాల వాటాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఇందారం ఐకే1ఏ గనిపై ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు తిప్పారపు సారయ్య, నాయకులు దుర్గం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ కమిటీ సభ్యుల ఎన్నిక

శ్రీరాంపూర్: అభయ చారిటబుల్ ట్రస్ట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సాందీపని ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా ట్రస్ట్ సీఎండీ రమేశ్ హాజరయ్యారు. ట్రస్ట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వినయ్ ప్రశాంత్, జనరల్ సెక్రెటరీ ట్రెజరర్‌గా అగస్టీన్, కోశాధికారిగా జాగిరి సురేష్‌లను ఎన్నుకున్నారు.

బతుకమ్మ సంబురాలు



శ్రీరాంపూర్: బతుకమ్మ సంబురాలు శ్రీరాంపూర్‌లో ఘనంగా నిర్వహించారు జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల కోసం ఇక్కడి నర్సరీ వద్ద బతుకమ్మ కార్యక్రమాన్ని కంపెనీ నిర్వహించింది. ఈ సందర్భంగా మహిళ ఉద్యోగులు ఉత్సాహంగా పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి మాట్లాడుతూ.. మహిళలకు ఎంతో ఇష్టమైన పండుగ బతుకమ్మ అన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ఇది ప్రతీక అని తెలిపారు. మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషదాయకమన్నారు. ఏరియా జీఎం సంజీవరెడ్డి బతుకమ్మ సంబురాలను దగ్గర నుంచి వీక్షించారు. కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏజెంట్ ఏవీ రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ జన్మదిన వేడుకలు



మందమర్రిరూరల్: రక్తదానం చేస్తున్న యువకులు

కోటపల్లి/చెన్నూర్‌రూరల్/మందమర్రిరూరల్/చెన్నూర్/రామకృష్ణాపూర్/శ్రీరాంపూర్/బెల్లంపల్లి: చెన్నూర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్కసుమన్ జన్మదిన వేడుకలను జిల్లాలోని పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. కోటపల్లి పార్‌పల్లి భైరవ స్వామి ఆలయంలో వైస్ ఎంపీపీ వాలశ్రీనివాస్ రావు, యూత్ అధ్యక్షుడు విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కిష్టంపేటలో కేక్ కట్ చేశారు. మందమర్రిలోని ప్రాణహిత కాలనీ (షిర్కే)లో యూత్ ఆధ్వర్యంలో 30మంది యువకులు రక్తదానం చేశారు. తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంజిత్‌కుమార్, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది మాదవి, మల్లేశ్వరి, రాజేశ్వరి ఉన్నారు. చెన్నూర్‌లో సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమం, జెండవాడలోని మంజునాథ దుర్గాదేవి మండపం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రామకృష్ణాపూర్ బీజోన్ ఏరియాలో కేక్ కట్ చేశారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి సమ్మయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు. శ్రీరాంపూర్‌లో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శ్రీ సాయి అంధుల పాఠశాలలో కేక్ కట్ చేశారు. బెల్లంపల్లిలో బీఆర్ఎస్ అనుబంధ బీర్ఎస్వీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

నేడు సోషల్ మీడియా వారియర్స్ సమావేశం

బెల్లంపల్లి: కాల్‌టెక్స్ ఏరియాలోని ఏఆర్ కన్వెన్షన్ హాల్లో గురువారం బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ విజయ్ ఆనంద్ హాజరవుతారని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్, బీఆర్ఎస్‌వై, బీఆర్ఎస్‌వీ, నాయకులు, సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్పీఐని ఆదరించండి

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్పీఐ)ని ఆదరించాలని ఆ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మొయ్య వేణుగోపాల్ అభ్యర్థించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆర్పీఐని గెలిపిస్తే అందుబాటులో ఉండి ప్రజాసమస్యలు పరిష్కరిస్తానన్నారు.

మేనిఫెస్టో కరపత్రాల ఆవిష్కరణ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాంబోజీపేటలో గొల్లకురుమ కుల పెద్ద జంగిలి రాజయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మంచిర్యాల జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ చైర్మన్ కొమ్ము అశోక్‌యాదవ్ బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరించారు.

ఉచిత కంటి ఆపరేషన్లు పూర్తి

మంచిర్యాలటౌన్: నిరుపేదల కంటి సమస్యలను రూపుమాపేందుకు గాను లయన్స్ క్లబ్ హైటెక్‌సిటీ ఆధ్వర్యంలో 14మందిని గుర్తించి, వారికి కరీంనగర్‌లోని లయన్స్‌క్లబ్ రేకుర్తి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి ఆపరేషన్లు పూర్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఇలియాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుపతి, కోశాధికారి చెట్ల రామయ్య పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లో ఈ నెల 20న నిర్వహించే ఏఐవైఎఫ్ 2వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు.

శైలజకు ఉత్తమ కళారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న శైలజ

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి చెందిన వడ్డాది శైలజ జాతీయ ఉత్తమ కళారత్న అవార్డు దక్కించుకున్నారు. మూడు రోజుల క్రితం న్యూఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) ఆధ్వర్యంలో బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరై ఆ రాష్ట్ర మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ చేతుల మీదుగా కళారంగంలో నృత్య కళాకారిణిగా రాణించిన వడ్డాది శైలజను ఘనంగా సన్మానించి కళారత్న అవార్డు అందజేశారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

దండేపల్లి: మండలంలోని కర్ణపేట, తానిమడుగు గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించినట్లు లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ బాబా తెలిపారు. గుడుంబా తయారు కోసం నిలవ్వచేసిన 600లీటర్ల బెల్లం పాకాన్ని పారబోసి, తయారు కోసం వినియోగించే సామగ్రిని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై రాబర్ట్, సిబ్బంది పాల్గొన్నారు.



బెల్లంపల్లి: పూజలు చేస్తున్న భక్తులు



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

దుర్గామాతకు పూజలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక రాళ్లపేట రోడ్ నంబర్–1 శివపంచాయితన సహిత అభయాంజనేయ సరస్వతీ దేవాలయం ప్రాంగణంలో మణికంఠ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద ఆలయ నిర్మాణ, లోకా కళ్యాణార్థం బుధవారం చండీ హోమం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు హోమం నిర్వహించి పూర్ణాహుతి జరిపారు. దుర్గాదేవి శాకాంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

శారదా పీఠంలో అన్నపూర్ణాదేవిగా..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్లల్లోని శ్రీ గాయత్రీ విశ్వకర్మ శారదాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రుల్లో బుధవారం దుర్గాదేవి అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది.

శివభక్త మార్కండేయ ఆలయంలో..

బెల్లంపల్లి: శ్రీ శివభక్త మార్కండేయ ఆలయంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. దుర్గామాత అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సతీష్‌కుమార్, ఉమా ప్రసాద్, రాజు, ఇతర సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ముల్కల్లలో అన్నపూర్ణాదేవిగా